మత్తు పదార్థాలను నిర్మూలించాలి: ఎస్పీ

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 2: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గత నెలలో జిల్లా పరిధిలో గంజాయికి సంబంధించిన కేసుల వివరాలను శుక్రవారం వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తున్నదని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం మెసేజ్ యువర్ ఎస్పీ నంబర్ 63039-22572 లేదా డయల్ 100కి కాల్ చేసి అందజేయాలని ఆయన సూచించారు. గత నెలలో 1.250గ్రాముల గంజాయిని సీజ్ చేసి, 13 మందిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. నిషేధిత మత్తు పదార్థాలు కలిగి ఉన్న, విక్రయించిన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

దుబ్బ రాజేశ్వరస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 2: నాగయ్యపల్లిలోని దుబ్బరాజేశ్వరస్వామి జాతర పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీకి వివరించారు. ఈనెల 8న మాఘ అమావాస్య పోచమ్మ బోనాలు, 9న శివ కల్యాణం, రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ సభ్యులు ఎస్పీని జాతరకు ఆహ్వానించారు. కార్యక్రమంలో బండి కొండయ్య, అచ్చ శంకర్, గుంట కొమురయ్య, మాసం విష్ణు, బండి రజినీకాంత్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సాగర్‌రెడ్డి (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 2: ఉద్యోగం వస్తుందో.. రాదోనని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మొర్రాయిపల్లె లో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గూడ రేణుక-సంజీవరెడ్డి దంపతుల ఏకైక కుమారుడు గూడ సాగర్‌రెడ్డి(18) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. సాగర్‌రెడ్డి మూడు నెలల క్రితం తన స్నేహితులతో కలిసి ఢిల్లీలో కంప్యూటర్ ట్రైనింగ్‌కు వెళ్లాడు. ఇటీవల ట్రైనింగ్ పూర్తి కావడంతో ఇంటికి తిరిగివచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. తనకు ఉద్యోగం వస్తుందో.. రాదోనని మనస్తాపం చెంది చెట్టుకు ఉరేసుకొన్నాడు. స్థానికులు గమనించేలోగా మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు గ్రామస్తులను కంట తడి పెట్టించింది. సాగర్‌రెడ్డి తండ్రి సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఎన్గల్‌లో ఎలుగుబంటి సంచారం

చందుర్తి, ఫిబ్రవరి 2: ఎన్గల్ గ్రామంలో ఎలుగుబంటి ప్రజలను బెంబేలెత్తిస్తోంది. గ్రామ శివారులోని కొత్తచెరువు, నక్క ఒర్రె ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఓ రైతు తన పత్తి చేనులో ఎలుగుబంటి సంచరిస్తుండగా గమనించినట్లు గ్రామస్తులకు తెలిపాడు. దీంతో రైతులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీ శాఖ అధికారులు త్వరగా స్పందించి ఎలుగుబంటిని బంధించాల్సిందిగా కోరుతున్నారు.

అడవి పందిని తప్పించే క్రమంలో..

- ఆటో బోల్తాపడి పలువురికి గాయాలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 2: వీర్నపల్లికి చెందిన ఓ కుటుంబం శుక్రవారం ఆటోలో తాడూరుకు శుభకార్యానికి వెళ్లింది. తిరిగి వస్తున్న క్రమంలో వీర్నపల్లి శివారులోని అటవీశాఖ కార్యాలయం వరకు చేరుకోగానే ఆకస్మాత్తుగా అడవిపంది అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వీర్నపల్లికి చెందిన అబ్రహం, ప్రభలత, పుష్ప, సత్తవ్వ, నవనీత, మంజులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు.

ప్రభుత్వ భూముల లెక్క పక్కాగా ఉండాలి

- ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు
- జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్ అనురాగ్ జయంతి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: జిల్లా పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ఖాళీ స్థలాలు ఎన్ని ఎకరాలు ఉన్నాయో రికార్డుల్లో ఉండాలని, వాటిపై తనిఖీ చేయాలని, ఆక్రమణలు ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంటింటికీ నీటి సరఫరా విషయంలో క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అని పరిశీలించి, సమగ్ర నివేదికను అందించాలన్నారు. శ్రీరాజరాజేశ్వర జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలపై ఆరా తీశారు. సిరిసిల్లలోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఎన్ని పరిశ్రమలు అనుమతి పొందాయి? ప్రస్తుతం ఎన్ని కొనసాగుతున్నాయి అనే వివరాలను టెక్స్‌టైల్ పార్క్ ఆర్డీడీ అశోక్‌రావును అడిగి తెలుసుకున్నారు. మొత్తం 116 పరిశ్రమలు అనుమతి పొందాయని, ప్రస్తుతం 62 కొనసాగుతున్నాయని జేడీ తెలిపారు. మిగతా పరిశ్రమలు వివిధ కారణాలతో మూతపడ్డాయని వివరించారు. అనంతరం శ్రీరాజరాజేశ్వర జలాశయం వద్ద చేపపిల్లల పెంపకం, అందుకు కావాల్సిన స్థలం, ఇతర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగం పరిధిలో 2014 నుంచి ఇప్పటి వరకు ఎన్ని పనులు మంజూరయ్యాయి.. ఎన్ని పూర్తయ్యాయి అనే వివరాలను సమర్పించాలని ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో చేపడుతున్న కేంద్రీయ విద్యాలయం నూతన భవన నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో క్రిటికల్ కేర్ యూనిట్, క్వార్టర్ల నిర్మాణాలకు కావాల్సిన భూములను సేకరించాలని, పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్దాపూర్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డులోని గోడౌన్‌లో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల మొదటి స్థాయి తనిఖీ ఏర్పాట్లపై కలెక్టర్ ఆరా తీశారు. ఈనెల 5వ తేదీ నుంచి ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, ఆర్డీడీ అశోక్‌రావు, మిడ్ మానేరు ఈఈ జగన్, జౌళి శాఖ ఏడీ సాగర్, ఇంట్రా ఈఈ జానకి, గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్, సీపీవో శ్రీనివాసచారి, డీపీవో రవీందర్, డీఈవో రమేశ్‌కుమార్, ఆర్అండ్ బీ ఈఈ శ్యామ్‌సుందర్, శివప్రసాద్, శ్రీనివాస్, రాఘవేందర్, కమిషనర్లు ఆయాజ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్ • జిల్లా కేంద్రంలో 35వ రోడ్డు భద్రతా మాసోత్సావాలు

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్/ రుద్రంగి /ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్, ఫిబ్రవరి 2: ప్రతి వాహనదారుడు, ప్రజలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద 35వ రోడ్డు భద్రతా మాసోత్సావాల్లో భాగంగా విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ట్రైయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డితో కలిసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ప్రాణం ఎంతో విలువైందన్నారు. మన మీద కుటుంబం ఆధారపడి ఉంటుందని దృష్టిలో ఉంచుకొని హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా, మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంతో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదుకు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు, జిల్లాలోని ప్రతి పాఠశాలలో రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ రాజు విద్యార్థులు, వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు. కాగా రుద్రంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి, బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ పాఠశాలలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, వీర్నపల్లిలోని మోడల్ స్కూల్‌లో ఎస్ఐ రమేశ్‌కుమార్, ముస్తాబాద్ జూనియర్ కళాశాలలో ఎస్ఐ శేఖర్‌రెడ్డి విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అభివృద్ధిని ఓర్వలేకనే..

- అసత్య ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు
- కేటీఆర్ సహకారంతో అగ్రగామిగా సిరిసిల్ల
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన రూ.40కోట్ల పనులు
- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులతో ప్రజల నుంచి తమకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు పాలకవర్గంపై అసత్య ప్రచారం చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మున్సిపల్‌పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కావాలనే అసత్య ప్రచారంతో తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కేసీఆర్, కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో వందశాతం మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.40కోట్లు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేశారని, దీనికి సంబంధించి వార్డుల వారీగా స్థానిక కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించి అవసరమైన 254పనులను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభించలేకపోయామని, ఇందులో నిర్లక్ష్యం ఎక్కడా జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీకి నిలిపివేసిన రూ.55కోట్ల పనులకు అనుమతులు తీసుకువచ్చి మాట్లాడాలని హితవు పలికారు. అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్న తమపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన మంచె శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దార్నం అరుణ, ఆడెపు సౌజన్య, రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, ఎండీ ఆస్మా, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు

తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

బీఆర్ఎస్ పాలనలో పల్లెలకు జాతీయ ఖ్యాతి

- ఎన్నికల నిర్వహణతో సుపరిపాలన సాధ్యం
- ఆలస్యమైతే గ్రామాలు అంధకారం
- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్ పాలనలో గత పదేండ్లలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సహకారంతో రాష్ట్రంలోని పల్లెలు జాతీయ స్థాయి అవార్డులను సొంతం చేసుకున్నాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పల్లెలు కోనసీమను తలపించాయన్నారు. వందశాతం మౌలిక వసతులు కల్పించి పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేశారని కొనియాడారు. ఉద్యమ కాలంలో నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి పదవీకాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించకుండా రెండేళ్ల పాటు జాప్యం చేసి పల్లెల్లో అభివృద్ధికి అడ్డుగా నిలిచారన్నారు. ఈ వ్యవధిలో కేంద్ర ప్రభుత్వ నిధులు రాకుండా నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానంతో మళ్లీ అవే పరిస్థితులు ఏర్పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన నాయకులు నాడు కేసీఆర్ పాలన, పనితీరును అభినందించారన్నారు. తద్వారా అనేక జాతీయ స్థాయి అవార్డులను తెలంగాణ పల్లెలు సొంతం చేసుకున్నాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా, కేసీఆర్ మానస పుత్రిక హరిత హారంతో పల్లెలు సుభిక్షంగా వర్ధిల్లాయన్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయో..? లేదోనని అనుమానం ఉందన్నారు. కులగణన తరువాత ఎన్నికలు చేస్తామని కాంగ్రెస్ చెబుతుందన్నారు. సీఎంతో పాటు మంత్రి వర్గానికి విన్నపం చేస్తున్నామని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పాలనలో విస్తృతంగా రైతులు వ్యవసాయం చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో మెదక్‌లో రైతులు రోడ్డెక్కిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి నర్మాలకు ఒక టీఎంసీ నీరు అందించాలని కోరామన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి నిరాశపరిచే విధంగా ఉందన్నారు. దేశంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగం వస్త్ర పరిశ్రమ అని పేర్కొన్నారు. పరిశ్రమ అభివృద్ధికి ఎటువంటి ప్రోత్సాహం అందించలేదన్నారు. చేనేత యారన్‌పై 12శాతం జీఎస్టీ వేసిన నేపథ్యంలో వస్త్ర పరిశ్రమ నిరసనతో 5శాతానికి తగ్గించిందన్నారు. సిరిసిల్ల ప్రాంతానికి ప్రత్యేకంగా మెగా పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేపిస్తామని చెప్పిన బండి సంజయ్ మాట నిలబెట్టుకోలేదన్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కుంబాల మల్లారెడ్డి, దార్నం అరుణ, వేముల రవి, అడ్డగట్ల మురళి, దిడ్డి రాజు, దార్ల సందీప్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
CHANGE OF NAME
★I, PINGILI MAMATHA, W/o. Guduru Veera Ramakrishna Rao, R/o. 1-17, Gadi Mahel, Manakondur, Karimnagar, TS. Changed My Name as GUDURU MAMATHA, W/o. Guduru Veera Ramakrishna Rao.
NT-311518

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

టీ హబ్ సేవలపై నీలినీడలు

- సీహెచ్‌సీలో నిలిచిన రక్తపరీక్షలు
- ట్యూబ్‌ల కొరతతో రోగుల ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: ట్యూబ్‌ల కొరతతో ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీలో 15 రోజులుగా రక్తపరీక్షలు నిలిచిపోయాయి. అంతకుముందు వారం రోజులుగా టీహబ్ యంత్రం చెడిపోవడంతో పలు టెస్టులకు రోగులు ఇబ్బంది పడ్డారు. పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీహబ్ సేవల నిర్వహణ సరిగా లేకపోవడంతో రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీలో టీహబ్ ద్వారా రోజుకు సుమారు వంద నుంచి 150 మంది పేషెంట్లకు పలు పరీక్షలు చేసేవారు. కాగా ప్రతి మంగళవారం, శుక్రవారం సగటున 50 మందికి హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్స్, రక్తంలో ఇన్‌ఫెక్షన్ తదితర రక్తపరీక్షలు నిర్వహించేవారు. కాగా ట్యూబ్‌ల కొరత కారణంగా 15 రోజులుగా సీహెచ్‌సీలో రక్తపరీక్షలు నిలిచిపోయాయి. దీంతో సిరిసిల్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో సమయ, ఆర్థిక భారంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అంతకుముందు టీహబ్ యంత్రం చెడిపోగా వారం పాటు పలు రకాల టెస్టులు నిలిచిపోయాయి. ఇటీవల యంత్రానికి మరమ్మతులు చేయించడంతో వైద్య సేవలను పునఃరుద్ధరించారు. మళ్లీ ఇటీవల నమూనాలు సేకరించే ట్యూబ్‌ల సప్లై నిలిచిపోయింది. దీంతో టీ హబ్ యంత్రం అలంకార ప్రాయంగా మారడంతో సర్కార్ దవాఖాన సేవలపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ట్యూబ్‌లను తెప్పించి రక్తపరీక్షలను నిర్వహించి మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యాధికారులను కోరుతున్నారు. కాగా వైద్య సేవల అంతరాయంపై టీహబ్ ప్రతినిధి రాంప్రసాద్‌ను వివరణ కోరగా.. ల్యావెండర్, గ్రే ట్యూబ్స్ కొరత ఉన్న మాట వాస్తవమేనని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

వేములవాడ, ఫిబ్రవరి 2: విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ సూచించారు. శుక్రవారం వేములవాడలోని బోయినపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విష జ్వరాలతో విలవిల

- 'పదిర'లో 70మందికి పైగా బాధితులు
- ప్లేట్‌లెట్స్ తగ్గి పెద్ద దవాఖానలో చేరుతున్న వైనం


విషజ్వరం బారిన పడిన బాలుడు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో దాదాపు 40రోజుల నుంచి గ్రామస్తులు విషజ్వరాలతో విలవిలలాడుతున్నారు. సుమారు 70మందికి పైగా సాధారణ జ్వరంతో మొదలై ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో గ్రామంలో ఒక రోజు మొక్కుబడిగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయినా ఎవరికీ తక్కువ కాకపోవడంతో చాలామంది మండల కేంద్రంతోపాటు సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. అయితే బొడ్రాయికి పూజలు చెల్లించకపోవడం వల్లే గ్రామస్తులు విషజ్వరాల బారిన పడుతున్నారని పుకార్లు వినిపిస్తున్నాయి. వెంటనే బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేయాలని గ్రామపెద్దలు చర్చిస్తున్నారు.

సర్వే చేయిస్తున్నాం.. భయపడొద్దు..

గ్రామంలో ఇదివరకే 260ఇండ్లలో సర్వే చేయించాం. అందుకు సంబంధించిన వివరాలు కూడా తీసుకుంటున్నం. అవసరం ఉంటే మరోసారి రక్త పరీక్షలు చేసి పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తాం. డెంగీ పరీక్ష కేవలం జిల్లా దవాఖానలో మాత్రమే చేస్తారు. డెంగీకి సంబంధించిన సమాచారం ముందుగా మాకే ఉంటుంది. ఇప్పటి వరకు అలాంటి కేసులు నమోదు కాలేదు. గ్రామస్తులు భయపడవద్దు. వెంటనే మరోసారి గ్రామంలో క్యాంపు ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: విద్యార్థుల కోసం సరైన సమయంలో బస్సులు నడపాలని డిపో మేనేజర్‌ను కోరినందుకు, తనతో దురుసుగా ప్రవర్తించాడని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ ఆరోపించారు. సిరిసిల్ల డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరారు. కంచర్ల రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సిరిసిల్ల పాత బస్టాండ్‌లో పలువురు విద్యార్థులు బస్సు ఎక్కుతుండగా, కొంత మంది విద్యార్థులను ఆర్టీసీ సిబ్బంది దిదింపేశారన్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం మనోహర్ దృష్టికి తీసుకెళ్లగా, బస్సుల గురించి ఇంకోమారు తమ దృష్టికి తీసుకువచ్చినా, విద్యార్థులు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా పోలీసు కేసులు పెడతామంటూ బెదిరించారని ఆరోపించారు. రద్దీ ఎక్కువగా ఉంటే బస్సుల్లో ఎలాగైనా వెళ్లాలని లేని పక్షంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టికెట్ తీసుకొని వెళ్లాలని అమర్యాదగా ప్రవర్తించాడని వాపోయాడు. డీఎం మనోహర్ తీరుపై కలెక్టర్ అనురాగ్ జయంతికి, ఆర్టీసీ ఆర్ఎంకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నతాధికారులు డీఎంపై చర్యలు తీసుకోవాలన్నారు.

'మున్నూరు కాపు' సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

ముస్తాబాద్, ఫిబ్రవరి 2: పోతుగల్ మున్నూరు కాపు పటేల్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వరి లక్ష్మణ్‌ను శుక్రవారం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధి సభ్యులు సహకారంతోనే సాధ్యమన్నారు. ఇక్కడ సంఘం ప్రధాన కార్యదర్శి ఆది లక్ష్మణ్, కోశాధికారి జిల్లాల భిక్షపతి, ఆర్గనైజర్ సెక్రటరీ జిల్లెల్ల రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో సీఎంఈ పరీక్ష సెంటర్

వేములవాడ, ఫిబ్రవరి 2: శాత్రాజిపల్లి రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష సెంటర్‌ను ఉందని కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. ప్రవేశ పరీక్ష హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. టీఎస్‌డబ్ల్యూఆర్‌సీడబ్ల్యూ సిరిసిల్ల (సెంటర్ కోడ్: 240805) ఉన్న విద్యార్థులు తమ కళాశాలకు రావాలని సూచించారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, ఐడీ కార్డు, బాల్ పాయింట్ బ్లూ, బ్లాక్ పెన్‌తో ఉదయం 9గంటల వరకే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షను నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

భర్త, అత్తమామలపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కంపాడుకు చెందిన బత్తుల(వంగాల) జ్యోతి, అదే గ్రామానికి చెందిన వంగాల సుమన్‌ను ప్రేమించి 2023లో పెళ్లి చేసుకుంది. అనంతరం వారు బొప్పాపూర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా కొన్ని రోజులుగా భర్త సుమన్, మామ స్వామి, అత్త సుగుణ, బావ సునీల్ అదనంగా రూ.10లక్షలు తీసుకురావాలని వేధిస్తున్నారన్నారు. దీంతో జ్యోతి ఠాణాలో ఫిర్యాదు చేయగా నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 2: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శుక్రవారం అనంతపల్లి నుంచి వేములవాడ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న కందుల భూంరెడ్డి (57) శాత్రాజుపల్లి వద్ద అగివున్న ఎక్స్‌కవేటర్‌ను ఢీ కొట్టడంతో భూంరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో భూంరెడ్డిని దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు జీవన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

భక్తి గీతాలాపన చేస్తున్న రఘునందన్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 2: శ్రీ త్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాల సందర్భంగా నాలుగో రోజు శుక్రవారం కళాకారులు తమదైన ఆలాపనలతో స్వామివారికి సంగీత నీరాజనాలర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10గంటలకు బాలంభారతి భాగవతార్ చెప్పిన హరికథ, 11.30గంటలకు జీ సురేఖ భాగవతార్ చెప్పిన హరికథ, సాయంత్రం 4.30గంటలకు భార్గవశర్మ సంగీత కచేరి, 5.30గంటలకు జయప్రద రామ్మూర్తి వేణువు సోలో కచేరి, సాయంత్రం 6.30గంటలకు ఉన్నికృష్ణన్ శాస్త్రీయ సంగీతకచేరి, రాత్రి 8 గంటలకు వై విజయలక్ష్మి, శాంకరి నృత్య బృందం చేసిన ప్రదర్శన, రాత్రి 9.30గంటలకు కే రాజు బృందం చేసిన భక్త ప్రహ్లాద పౌరాణిక నాటకం ఆద్యంతం శ్రోతలను ఆకట్టుకున్నది. ఇక్కడ ఉత్సవాల ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్యాశర్మ, మధు శ్రీనివాస్, సంగీత, సాహితీప్రియులు ఉన్నారు.

సేవలను గుర్తించి సన్మానం..

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/రుద్రంగి/ముస్తాబాద్/సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2: ఐదేండ్లు గ్రామానికి అందించిన సేవలను గుర్తించి ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంగ హేమలత, వార్డు సభ్యులను సన్మానించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, కార్యదర్శి సంతోశ్‌ను సన్మానించారు. ఇక్కడ ఎంపీటీసీ ఇల్లెందుల గీతాంజలి, పీఏసీఎస్ డైరెక్టర్ ల్యాగల సతీశ్‌రెడ్డి, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ఇల్లంతకుంట మండలం అనంతారం, వంతడుపులలో పాలకవర్గాన్ని గ్రామస్తులు సన్మానించారు. రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత-మనోహర్‌ను శుక్రవారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తర్రె ప్రభలత-మనోహర్ విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. రుద్రంగి మండలం మానాలలో పంచాయతీ పాలకవర్గాన్ని నాయకులు, ప్రధానోపాధ్యాయుడు కె.సమ్మిరెడ్డి ఘనంగా సన్మానించారు. ముస్తాబాద్ మండలంలోని మోహినికుంట సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఉప సర్పంచ్ నారాయనోజి సంధ్య, వార్డు సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లెలో ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ ముచ్చంతుల కమల-గోపాలరెడ్డి, పాలకవర్గాన్ని సన్మానించారు. తాడూరులో మాల సంక్షేమ సంఘ సభ్యులు సర్పంచ్ దంపతులు సురభి సరిత-నవీన్‌రావు దంపతులు, ఉపసర్పంచ్ కసాని గంగాధర్‌ను సన్మానించారు.

రుద్రంగిలో సర్పంచ్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


ఇల్లంతకుంట మండలం అనంతారంలో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు